కథ

# రెండు ముల్లులు - ఒక గడియారం

వినీత గడియారం ముల్లుని పదినిముషాలు ముందుకి తిప్పింది. రోజూ ఉండే పనే అది. రాత్రి ఎంత సద్ది పెట్టినా పొద్దున్నయ్యేసరికి కరెక్ట్‌గా పది నిముషాలు వెనక్కి వెళుతుంది. బాగు చేయిద్దామనుకుంటూనే అశ్రద్ధ. చకచకా పనుల్లో పడింది. పక్కనే ఉన్న క్రెష్‌లో బాబుని దించేసి, మళ్ళీ వెనక్కి వచ్చి, లంచ్ బాక్స్ సద్దుకుని, చీర కుచ్చెళ్ళు సద్దుకుని, పర్సు సద్దుకుని- ఆఫీసుదారి పట్టింది.

బయట నుంచి చూసేవాళ్ళకి ఆమెది సుఖమయమైన జీవితం. హాయిగా సంపాదిస్తుంది. మంచి భర్త, పిల్లాడు- ఆర్జనని ప్రతిబింబించేట్టు హంగులు-

ఆ పూట కూడా ఊరునుంచి వస్తానన్న భర్త రాలేదు. చిన్నగా నవ్వుకుంది. ఆమెకి బాధగా లేదు.

భర్త రాంగానే మళ్ళీ మాట్లాడుతుంది. కొన్నాళ్ళపాటు తనకు ఏమీ తెలియదన్నట్టే మసులుకుంటుంది. తనెందుకు నోరు విప్పి ప్రశ్నించాలి? సమస్య తనది కాదు. అతనిది, అందులోనూ అత్యంత వ్యక్తిగతమైంది.

'హాయ్' అంటూ ఎదురొచ్చింది చిత్ర మంచి షిఫాన్ చీరలో సున్నితంగా మెరుస్తూ. వినీత చేతిని ఇష్టంగా నొక్కి గుసగుసగా అంది- "సందీప్ ఈరోజు డిన్నర్‌కి తీసుకెళ్తున్నాడు. మా ఆయన రేపటి వరకూ రావట్లేదు. సందీప్ వాళ్ళ అమ్మ పెళ్ళి సంబంధాలు తెస్తోందిట. తన సంగతి తెలుసుగదా- నన్ను చూడందే రోజు గడవదు. అయినా ఈ అమ్మాయి విషయంలో ఏదో రాజీపడాలనుకుంటున్నాడు. నన్నే సలహా చెప్పమన్నాడు. 'అలాగే' అన్నాను. నాదేం పోతుంది?"

చిత్ర స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుంది. ఆ టెలివిజన్ ఛానెల్‌లో జీవితాలకి, స్టోరీలకి పెద్దగా పొంతన లేని వంటలో నాలుగు చెమ్చాలు అవీ, ఇవీ కావలసినవి వేస్తుంది. వినీతకంటే నాలుగేళ్ళు పెద్దది. అల్లరిగా, చంచలంగా ఉంటుంది. ఏదో మర్చిపోదామనే ప్రయత్నంలో భాగంగా వేళాకోళంతో, తెచ్చిపెట్టుకున్న ఇమ్మెచ్యూరిటీతో ఆకర్షణీయంగా ఉంటుంది.

"జాగ్రత్త, గొడవలు అవ్వనివ్వకే"- అంతే గుసగుసగా వినీత హెచ్చరించింది.

నాలిక చప్పరించి, కన్నుగీటి- 'మలుపు' సీరియల్ ఎపిసోడ్ల డిస్కషన్ కోసమని ఫైలు పట్టుకుని వయ్యారంగా బోర్డ్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

**కిరణ్మయి**



వినీత చిత్ర వెళ్ళినవైపే చూస్తూ ఆలోచనలో పడింది. ఆఫీస్ బోయ్ టీ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

ఆమెకి భర్త గుర్తుకొచ్చాడు. ఏం చేస్తున్నాడో? ఫోన్‌లేదు- మాటలేదు, కబురు లేదు.

"మీకు ఫోనండీ" శాస్త్రిగారు వెనక్కి తిరిగి సాగదీసి రిసీవర్ అందించారు.

"హలో"

"హలో విన్నీ- నేనే ఎలా వున్నావు?" భర్త గొంతు.

"బానే ఉన్నాను. ఎక్కడ్నించి?"

"ఇంకా ఊళ్ళోకి రాలేదు. బయట్నించే చేస్తున్నా"

"ఎప్పుడొచ్చేది?'

ఒక్కసారి ఊపిరి తీసుకున్నాడు. "ప్రైమ్ మినిస్టర్ వెంట పడేశారు. ఆయన ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్ళాలి. అనుకోకుండా వచ్చిపడింది. మేజర్ రిపోర్ట్ రేపు రాత్రికి ఫీడ్ చెయ్యాలి. వచ్చేటప్పటికి ఎల్లుండి సాయంత్రం అవుతుందనుకుంటా."

"ఊఁ"

"అదోలా ఉన్నట్టున్నావు?"

"అబ్బే- ప్రైమినిస్టర్ అనగానే తెగిపోయిన చెప్పులతో నువ్వు ఫస్ట్‌ప్రెస్ కాన్ప

రెన్స్‌కి వెళ్ళడం గుర్తొచ్చింది"- నవ్వుతూ అంది.

ఆక్సిజన్ అందినట్టు తెరిపిన పడి గట్టిగా నవ్వాడు.


"లేదులే- ఈసారి జాగ్రత్తగానే ఉంటాను. బాబు ఎలా ఉన్నాడు?"

"వాడికేం- బానే ఉన్నాడు. మాటలు, అల్లరి, పక్కలో ఉచ్చలు, పాటలూ, డాన్సు!"

అంతా సజావుగానే ఉందన్న ధైర్యం కోసం ఎంత మాట్లాడాలనుకుంటున్నాడో! ఆమె ఒక్క క్షణం ఆగి- "తొందరగా వచ్చెయ్యి" అంది.

భర్తతో మాట్లాడి ఫోన్ పెట్టేసిం తర్వాత- శాస్త్రిగారు రెండు క్విజ్ షో కాన్సెప్ట్ ఫైళ్ళు ముందుంచారు. వాటి గురించి అదే రోజు తేల్చెయ్యాలి. గబగబా పేజీలు తిప్పింది. మనసు లగ్నం కావట్లేదు. తన భర్త ఎలాగైనా నిజం తెలియకూడదనే తాపత్రయమే ఎక్కువ పడుతున్నాడు. ఒక్కసారి కూడా నిజాయితీగా నిజం చెప్దామనుకోవట్లేదు. ఆమెకు వింతగా, జలదరింపుగా ఉంది. . ఎవరిచేతైనా నిజం చెప్పించాలంటే ఏంచెయ్యాలి?

ఎదురుగా ఉన్న కాన్సెప్ట్‌లలో ఒకటి బానే ఉంది. అందులో పొందుపరచిన ప్రశ్నల్ని ఆమె కళ్ళు చకచకా అంచనా వెయ్యడం మొదలుపెట్టాయి.



** ** **

వినీత భర్తకి హిందీ, ఇంగ్లీషు జర్నలిస్ట్ సర్కిల్స్‌లో ఉన్న పేరు అంతా ఇంతా కాదు. తెలుగు మాట్లాడతాడు కానీ చదవటంరాదు. హిందీలో మంచి వ్యాసకర్త. తెలుగు కుటుంబమే అయినా పెరిగిందంతా యు.పి.లో అవడంతో శుద్ధ హిందీ పట్టు. అదే ఆర్యన్ గేర్. మహా మర్యాద ముసుగులో ఈ సౌత్‌లో చాలా విషయాలు ఇంతే అనే లోకువ.

ఇద్దరికీ పెళ్ళి అయ్యేటప్పటికి అతనికి మంచి పేరు ఉంది. రాజకీయ రౌండప్‌లు, ఎనాలిసిస్, రిపోర్టింగ్, వ్యాసాలు- చకచకా ఎదిగిపోయాడు. ఆమెకిఎప్పుడూ అతని తెలివి మీద వీసమెత్తైనా అనుమానం లేదు. ఉంటే తన తెలివి మీదే ఉండేది. పెళ్ళిముందు, ఆ తర్వాత అతను కురిపించిన ప్రేమని చూసి అసూయపడని వాళ్ళు లేరు.

ప్రేమించడం గొప్ప అనుభవం. దాన్నుంచి ఎప్పుడూ ఏదో లభిస్తూ ఉంటుందనుకోవడం అర్థంలేని మాట. అసలు ప్రేమించడమే నిజమయితే మనసులో ఆనందం కలుగుతుంది. ఎవర్నీ తప్పు పట్టాలనిపించదు. హృదయంలోని ఓ భాగం మౌనంగా అన్నీ అర్థం చేసుకుంటూ ఉంటుంది.

ఇప్పుడు తల్చుకుంటుంటే అదంతా ఏదో గత జన్మ అనుభవంలా ఉంది.

ఎవరయ్యుంటుంది ఆ అమ్మాయి? ఎంత మాత్రం పైకి తేలకుండా అతను జాగ్రత్తపడుతున్నాడు. ఇద్దరు, ముగ్గురు స్నేహితులు- ఎలర్ట్ చేయడానికన్నట్టు చూచాయగా చెప్పారు. కానీ అప్పటికే వినీతకి తెలిసింది- ఎలా తెలిసింది?

ఎందుకో అతని కళ్ళల్లోకి చూస్తే అర్థం అయింది. ఏదో మనసులో చటుక్కున మెదిలింది. ఎంత సున్నితంగా అర్థమైందో చెప్పలేదు. తన ప్రవర్తనలో ఏం మార్పు రానివ్వలేదు. అయినా దూరం వచ్చేసింది.

ఒకటి రెండు సందర్భాలలో అతనికే అనుమానం వచ్చింది- వినీత ఏదో మనసులో దాచుకుని బెట్టిస్తోందేమో అనిపించింది. కానీ అతనికి తిన్నగా ప్రశ్న అడగానికి అవకాశంలేని పరిస్థితి. వినీత అడిగితే చూద్దామనుకున్నాడు. వినీత అడగలేదు.

ఆమె మనసులో అనుకుంది- తను ప్రశ్న వెయ్యదు. అతనే ఏదో రోజు చెప్పాలి. ఎందుకు చెప్పడు? ఎన్నాళ్ళు ఉండగలడు. అతని అప్యాయతలు మరోవైపు అల్లుకోవడం మొదలుపెట్టాయి.

** ** **

వినీత పెరిగిన వాతావరణంలో తల్లిదండ్రికి మంచి సర్కిల్ ఉంది. సినిమా కళాకారులు, డాన్సర్లు, సంగీతకారులు, రచయితలు, ప్రభుత్వోద్యోగులు- ఎంతమందో! ఆ వాతావరణంలో ఆమె నేర్చుకున్నదంతా మంచి ఆలోచనని నమ్మడం, నిజాయితీగా తనకు నచ్చిన దానిని ఆచరణలో పెట్టుకోవడం. మంచి ఆస్వాదనని పెంచుకోవడం. "జీవితంలో ఆస్వాదించే శక్తి లేకపోతే- చివరికి ఏం మిగలదు నాన్నా"- నాన్న ఎప్పుడూ అనేవాడు.

ఇతనితో ప్రేమలో పడడం కూడా హిందీ పాటల దగ్గర్నుంచి మొదలయ్యింది. ఆ పాట ఈ పాట పాడుకోవడం- తనంటే పడి చచ్చిపోయేవాడు. నిజంగా స్వచ్ఛంగా ప్రేమించాడు. అది తనకు అప్పటికే తెలుసు, ఇప్పుడూ తెలుసు. కానీ అలాంటి ప్రేమ ఎప్పటికీ నిలుస్తుందని అనుకోవడానికి లేదు. అదే జరిగింది. బాబు పుట్టిన తర్వాత నుంచి- ఏదో దూరం వచ్చేసింది. అతనికి పిల్లలంటే అస్సలు ఇష్టంలేదు. ఒక పరిస్థితిలో తను పిల్లాడ్ని కంటానని సున్నితంగా చెప్పడం- బస్.

కానీ, అంత మాత్రానికే-?

సందీప్‌కి నచ్చుతుందేమోనన్న సంబంధం తిప్పికొట్టించి పంపించేసిందిట చిత్ర. ఆ విషయం రెస్టారెంట్‌లో ఎక్కిళ్ళ మధ్య చెప్పింది. వినీత నిశ్శబ్దంగా వింది. సందీప్ ప్రేమని వదులుకోవడం చిత్రకి ఎంత మాత్రం ఇష్టంలేదు. అతనిది నిష్కల్మషమైన ప్రేమ అని ఏదో అభిప్రాయం. అతడొక శరత్‌చంద్రుడి క్యారెక్టర్. చిత్ర పెళ్ళి, చిత్ర బాధ్యతలు ఏమీ అక్కర్లేదు. పోనీ హాయిగా లాక్కెళ్ళిపోతాడా అంటే అలా ఉండడు. అంతా రహస్యం, దాపరికం, మొహమాటం. చిత్రతో చెప్పాల్సొచ్చేటప్పటికి మాత్రం నిజాయితీ! 'వెర్రిబాగుల వెధవా నీ మనసంతా ఇక్కడికొచ్చి విప్పుతావెందుకురా?' అని అడుగుదామనిపించేది వినీతకి. ఈ నిశ్శబ్ద సమరంలో చిత్ర ఎప్పుడూ నలిగిపోతూనే ఉండేది.

ఇప్పుడు చిత్ర ప్రవర్తన కూడా విచిత్రంగా అనిపిస్తోంది. ఎంత కాంప్లెక్స్ విషయం అయితే అంత టీనేజ్ లవ్‌లా ప్రవర్తించడం. 'ఇది కుదరదు'- 'ఇలా ఎందుకు ఉండాలి', 'నీదారి నువ్వు చూసుకో' లేదా 'ఇద్దరం కలిసి ఎటైనా పోదాం' అనే ఏ తర్కం ఎక్కడా కనిపించట్లేదు.

"నేనైతే నువ్వూ, అతనూ విడిగా వెళ్ళిపోయి కొత్త బతుకు మొదలుపెట్టాలంటాను. అయిందేదో అయింది. అతను నిన్ను చాలా ప్రేమిస్తున్నాడు. అందులో అనుమానం లేదుగా. నన్నడిగితే అంతకంటే ముఖ్యమైంది ఏదీ చూసుకోక్కర్లేదు" వినీత తన సలహాని గట్టిగా వినిపించింది.

** ** **

ప్రేమించడం గొప్ప అనుభవం. దాన్నుంచి ఎప్పుడూ ఏదో లభిస్తూ ఉంటుందనుకోవడం అర్థంలేని మాట. అసలు ప్రేమించడమే నిజమయితే మనసులో ఆనందం కలుగుతుంది. ఎవర్నీ తప్పు పట్టాలనిపించదు. హృదయంలోని ఓ భాగం మౌనంగా అన్నీ అర్థం చేసుకుంటూ ఉంటుంది. బయటి ప్రపంచపు ప్రతినిధుల్లాంటి వాళ్ళు మనసులోకి ప్రవేశించి



సతాయిస్తారు. చవకబారుగా ప్రవర్తిస్తారు. వాళ్ళకు వాళ్ళ అనుభవాలే సబబైనవి, కొత్తవి అనిపిస్తాయి. ఎదుటి వాళ్ళకు కలిగినవి అబద్ధాలు, అంత విలువైనవి కావు అనిపిస్తాయి. అన్నిటినీ మించి ప్రేమించే వాళ్ళ కుండే సహనం ప్రేమింపబడే వాళ్ళకి ఉండకపోవచ్చు. వాళ్ళకు తమని ప్రేమించే వాళ్ళని లోకువగా చూడడమే చాతవచ్చు. ఎన్నోరకాల అసహనపరుల మధ్య ప్రేమని నిలబెట్టుకోవడం ఎప్పుడూ కష్టమే. ఆ నిజాయితీని, అసూయని, అవివేకాన్ని కనురెప్పల కిందే తొక్కిపెట్టే అసహనపరుల కళ్ళల్లోకి చూస్తే వీటికింద ఎన్ని శవాలు దాగి ఉన్నాయో అనిపిస్తుంది. ఎదుటి మనసులోని వెలుగుని ఎక్కడా ఛాయామాత్రంగా అర్థం చేసుకునే అవకాశం అక్కడ ఉండదు.

వినీతకి భర్త గుర్తొచ్చినప్పుడల్లా అతని/ అనిజాయితీ కళ్ళే గుర్తొస్తున్నాయి. అతని మనసులో కలిగిన స్పందనని కాదనేంత సంకుచితంగా మాత్రం తనుండకూడదు. కానీ, తన ప్రేమకి అతను ఏమైనా విలువ ఇస్తున్నాడా?

వినీత భర్తకి మరో స్త్రీతో ఎఫైర్ నడుస్తోందని చాలామంది అనుకుంటున్నట్టు ఆమెకి ఏదో పార్టీలోకి అడుగుపెడితేనో, ఏ గృహప్రవేశంకి వెడితేనో అర్థం అయ్యేది. ఎంత చిన్న సంకేతాలతోనో మనుషులు మాట్లాడతారు. అర్థంకాదనుకుంటారో లేకపోతే అర్థం అవ్వాలనే అనుకుంటారో!

***చిత్ర బాధపడుతున్నట్టు స్పందించటం వినీతకి కాస్త ఆశ్చర్యం కలిగించింది. ఎందుకు బాధపడాలి? ఎవరికైనా మనసులో ప్రేమ చచ్చిపోతే ఏం చేస్తూ ఉంటారు? అది దొరికేచోట్ల వెతుక్కుంటారు. సింపుల్. మనం వేస్తే ముందడుగు, పక్కవాళ్ళు వేస్తే తొందరపాటో, అనైతికతో అనుకుంటే ఎలా కుదురుతుంది?***

ఆమె మామూలుగా ఉండడం కూడా కొంత మందికి ఆశ్చర్యం కలిగించినట్టు ఆమెకి అర్థం అయింది. ఏం చేస్తుంది? మంచి చీరలు కట్టుకోవడం ఆపేస్తుందా? తలకి నీళ్ళు పోసుకోవడం, చెంపలు ఆరిపోతున్నట్టు కనిపిస్తే మెత్తటి క్రీమ్ రాసుకోవడం, కళ్ళల్లోని జ్ఞాపకాలకు ఔట్‌లైన్ ఇచ్చినట్టు కాటుక పెట్టుకోవడం ఆపేస్తుందా? అవన్నీ చేస్తోందని ఆమెకు మనసులో బాధ ఉండదని ఎలా అనుకుంటారు?

అద్దం ముందు నిలబడి, చీర కట్టుకుంటూ తనని చూసుకుంది. ఆకుపచ్చని క్రేప్ చీర. ఖరీదు కనిపించని ఖరీదైన చీర. ఒకప్పుడు అలాంటి చీర కట్టుకుంటే బాగుండేదని మనసుకి అనిపించేది. ఇప్పుడు మనసంతా ఏదోలా ఉంది.

నాన్నకి ఎటాక్ వచ్చిందని అమ్మ ఫోన్ చేసింది. వెంటనే వెళ్ళగలిగిందా? ఉహుఁ. ఉద్యోగం పుణ్యమా అని రెండురోజులకు కానీ సెలవు దొరకలేదు. నాన్నని చూస్తే దుఃఖం వచ్చింది. బద్దలా ఉన్నాడు.

బాబు చీర కుచ్చిళ్ళకు చుట్టుకుని పైకి చూశాడు. వాడిని ఎత్తుకుని బుడిబుడి పలుకులు పలికి, కేన్ ఉయ్యాలలో కూచోబెట్టి పమిట కుచ్చెళ్ళు పెట్టుకుని పిన్ను పెట్టుకుంది.

అతన్ని ప్రేమించినంతకాలం, అతని ప్రేమ పొందినంతకాలం అతని గురించి ఇంత ఆలోచించేదేకాదు. ఇప్పుడు- అతని ప్రేమ పరామర్శలా వినిపిస్తున్నపుడు, ఒకవిధమైన ప్రశ్నలా మారుతున్నపుడు- అతని గురించి ఎక్కువ ఆలోచిస్తోంది.

ఆమె చిన్న వయసుకే మంచి పుస్తకాలు చదివింది. జిడ్డు కృష్ణమూర్తి, సార్త్రల అస్తిత్వపు ప్రశ్నలు, దుఃఖపు సమాధానాలు, బ్రెక్ట్ నాటకాలు, వ్యక్తులూ, వ్యక్తిత్వాలు- ఏవీ అక్కరకు రావు. ఎన్ని చదివినా, ఏం అర్థం చేసుకున్నా చివరికి నువ్వు పుట్టించిన పిల్లల దగ్గరకి వచ్చి జీవితం ఆగుతుంది. ఇది ఇమ్మీడియట్ రియాలిటీ అని గుర్తుచేస్తుంది.

గడియారం వైపు చూసింది. పదినిముషాల తక్కువ ఆరు- అంటే ఆరు. ఎప్పుడు ఇది కరెక్ట్‌గా తిరగడం మొదలెడుతుందో! వినీతకి చిత్ర గుర్తొచ్చింది. చేస్తే ఇంట్లో ఉంటుందా అనుకుంటూ డయల్ చేసింది. పీలగా, భయంగా చిత్ర 'హలో' వినిపించింది.

"నువ్వా విన్నీ- నిజంగా ఇప్పుడే నిన్ను తల్చుకుని ఫోన్ చేద్దాం అనుకుంటున్నాను. టెలీపతి గురించి ఎవరైనా రిసెర్చ్ చేస్తే నీమీదే మొత్తం పేపర్ రాయచ్చు."

"నిన్ను కలవాలని ఫోన్ చేస్తున్నాను. మన షూటింగ్‌ల గురించి ప్లాన్ చెయ్యాలి. నా క్విజ్ ప్రోగ్రాంలు. నీ 'మలుపు' ప్రిపరేషన్లు. ఎప్పుడు, ఎలా చేద్దామంటావు? ఆఫీసులో కాకుండా బయట కలుద్దామా? ఇప్పుడు పుస్తకాల షాపుకి వెళ్తున్నా- నా షో డిజైనింగ్‌కి ఆర్ట్ పుస్తకాలు ఏమైనా ఉపయోగపడతాయేమో చూద్దామని ప్రయత్నం."

"నేనూ నీతో మాట్లాడాలి. ఆఫీసు గోల కాదు. ఈరోజే ఏడున్నర ప్రాంతంలో వీలౌతుందా?"

రెస్టారెంట్‌కి చేరిన చిత్రని చూస్తే వినీతకి బాధవేసింది. మనసంతా కలతగా అయిపోయింది. అంత వెలిసిపోయిన మనిషిలా చిత్రని ఎప్పుడూ చూడలేదు.

'స్ట్రాంగ్ కాఫీ' అని రెండు వేళ్ళు చూపించి–చిత్ర ఆమె కళ్ళలోకి కళ్ళు పెట్టింది.

వినీతకి విచిత్రంగా అనిపిస్తోంది. తన భర్తకి ఏ అమ్మాయితో పరిచయం ఉందో కానీ, ఆ అమ్మాయి చిత్రలాంటిదే ఎందుకు కాకూడదు?

"గత రెండురోజుల్లో చాలా నిర్ణయాలు తీసుకున్నాను" చిత్ర గొంతు విప్పి అన్నీ చెప్పడం మొదలుపెట్టింది.

"సందీప్ లేకుండా నేను బతకలేను. అతను వేరే ఎవరినైనా పెళ్ళి చేసుకోవడం భరించలేను. నా భర్త మంచివాడో, చెడ్డవాడో ఈ విషయం అతనికి చెప్పిన తర్వాత తెలుస్తుంది. మేం ఇద్దరం వెళ్ళడం అయితే వెళ్ళిపోతున్నాం. సందీప్ వాళ్ళ అమ్మగారికి అస్సలు ఇష్టంలేదు. నేను ఆవిడని తప్పు పట్టను. పిల్లలు లేకపోవడం వలన పెద్ద ఇతర సమస్యలేం లేవు. కానీ మా ఆయన విషయం ఏమవుతుందో తెలీదు. అతని గురించి ఆలోచించలేకుండా ఉన్నాను. ఈరోజో, రేపో చెప్పేస్తాను.

"అతనికి ఇంకా తెలీదని ఎలాఅనుకుంటున్నావు?" చిత్ర విచిత్రంగా చూసింది.

"అతనికి ఇలాంటి విషయాలు అర్థం చేసుకుని ఫాలో అయ్యేంత తీరిక, ఇంట్రెస్ట్ లేవు."

వినీత అంత సానుభూతిలోను ఫక్కున నవ్వింది. ఆపుకోలేక అడిగింది. "నేను అలాంటి తీరిక, ఇంట్రెస్ట్, తెలివితేటలున్నదానిలా కనిపిస్తున్నానా?"

లేదన్నట్టు చిత్ర తలూపింది.

"విజ్జూ కూడా ఈమధ్య కొంచెం కొత్త స్నేహాలలో ఉన్నాడు. ఎవరినో తెగ ప్రేమిస్తున్నాడు."

చిత్ర నమ్మలేనట్టు చూసింది.

"అదేమిటి, నువ్విలా?- నిన్న కూడా ఫోన్ చేశాడుగా- బానే మాట్లాడావు."

"ఎవరి మీదైనా అనుమానం ఉంటే మాట్లాడడం ఆపెయ్యాలా?"

"అహఁ అలాకాదు. నువ్వెప్పుడూ చూచాయగా కూడా అనలేదు. పైగా బానే ఉన్నట్టు కనిపించావు."

"కనిపిస్తే అంతా బానే ఉన్నట్టేనా? గత సంవత్సరంగా నువ్వు ఎంతో బాగాఉన్నట్టు కనిపించావు. నీకు మాత్రం ఎంతమనశ్శాంతి ఉంది, చిత్రా?"

ఏం మాట్లాడలేదు.

"నువ్వే ఆ అమ్మాయి అయ్యుంటే అని ఆలోచిస్తున్నాను."

"ఛఛ అలా అనకు విన్నీ"

చిత్ర బాధపడుతున్నట్టు స్పందించటం వినీతకి కాస్త ఆశ్చర్యం కలిగించింది. ఎందుకు బాధపడాలి? ఎవరికైనా మనసులో ప్రేమ వచ్చిపోతే ఏం చేస్తూ ఉంటారు? అది దొరికేచోట్ల వెతుక్కుంటారు. సింపుల్. మనం వేస్తే ముందడుగు, పక్కవాళ్ళు వేస్తే తొందరపాటో, అనైతికతో అనుకుంటే ఎలా కుదురుతుంది?

** ** **

"మలుపు" సీరియల్ సూపర్‌హిట్ అయింది.

వినీత భర్త ఊరునుంచి వచ్చి అప్పటికి రెండు రోజులయింది. ఆ పూట టీవీ ఛానెళ్ళు మారుస్తుండగా 'మలుపు' చివర వచ్చిన చిత్ర పేరు చూసి- అతను చిత్ర గురించి అడిగాడు TRP రేట్లలో చిత్ర చేసిన సీరియల్ మంచి దశలో ఉండడం ఆమె కెరీర్‌కి మంచిదని లెక్కలు వేశాడు. అలా వచ్చిన చిత్ర ప్రస్తావన- చిత్ర, సందీప్‌ల రిలేషన్‌షిప్ దాకా వెళ్ళింది.

వినీత చిత్ర గురించి నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టింది. అతను శ్రద్ధగా విన్నాడు. మృదువైన ఆమె కంఠం, కళ్ళల్లో కదిలిన ప్రేమ- అతను వినటమే తన బాధ్యత అన్నట్టు, ఏదో పాట వింటున్నట్టు విన్నాడు. అక్కడా ఇక్కడా కాస్త ఆశ్చర్యపోయాడు. ఆమెకి తమాషాగా అనిపించింది.

ఆ తర్వాత, విజ్జు ఏవో ఆలోచనల్లో- అటూఇటూ తననే గమనించడం వినీత గమనించింది.

మొత్తం జీవితం నిలువెత్తు పోటులా ఆమె గొంతులో సుడులు సుడులుగా తిరిగింది. ఎవరికీ చెప్పుకోలేని దుఃఖం. వేటగాడు చెట్టు వెనక నుంచి బాణాన్ని ఎక్కుపెట్టి అదనైన క్షణం కోసం ఎదురుచూస్తుండగా, బాణం తగలబోయే జంతువుకు ఎలాగో చూచాయగా తెలుస్తుందిట. ఇన్‌స్టింక్ట్. కానీ ఎటుపోవాలో తెలీదు, పాపం. ప్రమాదం ఎక్కడ్నించి వస్తోందో తెలీదు.

వినీతకి ఏం జరగబోతోందో తెలుసుకానీ, ఎప్పుడో తెలీదు.

** ** **

> **అతన్ని ప్రేమించినంతకాలం,**
> **అతని ప్రేమ పొందినంతకాలం**
> **అతని గురించి ఇంత ఆలోచించేదేకాదు.**
> **ఇప్పుడు- అతని ప్రేమ పరామర్శలా**
> **వినిపిస్తున్నపుడు, ఒకవిధమైన ప్రశ్నలా**
> **మారుతున్నపుడు- అతని గురించి**
> **ఎక్కువ ఆలోచిస్తోంది.**

చిత్ర ఉద్యోగం మానేసి సందీప్‌తో కలిసి రాజస్థాన్ వెళ్ళిపోవడానికి రెడీ అవుతోంది. అక్కడ సందీప్ మామయ్యగారి బిజినెస్ చూడడానికి అతని అవసరం ఉందిట. స్థలం మార్పిడి కూడా ఇద్దరికీ మంచిది అనిపించింది. చిత్ర భర్త పిచ్చివాడయిపోతాడని అందరూ ఊహించారు కానీ, అతను హుందాగా రియాక్ట్ అయ్యాడు. డిటాచ్డ్‌గా దూరంగా వెళ్ళిపోయాడు. వినీతకి అతన్ని కలిసినపుడు అలాంటి మగవాళ్ళు ఉంటారన్న విషయం ఆనందాన్నిచ్చింది. ఇద్దరి పరిస్థితుల్లోని కామ్రేడరీ ఆమెకి కాస్త నవ్వు తెప్పిస్తూనే అతన్ని సానుభూతితో అభిమానించేలా చేసింది.

చిత్రని, సందీప్‌ని ఆపూట భోజనానికి పిలిచింది. వినీత భర్త మంచి హోస్ట్ అయిపోయాడు. పిల్లాడిని ఆడిస్తూ, ఆడుతూ వంటలో చెయ్యి అందిస్తూ చిత్ర, సందీప్‌లకి భోజనం పెట్టి శుభాభినందనలు అందించాడు. బయట నుంచి కొత్తగా చూసే వాళ్ళకి విజ్జూ, వినీత ఎంతో సఖ్యంగా కాపరం చేసుకుంటున్న జంట!

చిత్ర తననే చూస్తూ ఉండడం వినీత మధ్యమధ్యలో గ్రహించింది. అప్పుడప్పుడు తల ఎత్తి చిరునవ్వు నవ్వింది. కొంతసేపటికి చిత్ర అటూ ఇటూ చూసి, దగ్గరకి వచ్చి కౌగలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంది. "ఐ విల్ మిస్‌యూ టెరిబ్లీ"-

"ఆ మలుపు సీరియల్ ఎక్స్‌టెన్షన్ కోసం ఆలోచిస్తున్నారట- ఉండిపోయి ఇంకో ముప్ఫయ్యో, నలభయ్యో వండు" అంది వినీత చమత్కారంగా.

చిత్ర నవ్వింది. "పరమ బోరు పని బాబూ"

"ఆ పని ఇప్పుడు నాకిస్తామంటున్నారు" వినీత హాస్యంగా కనుబొమలు ఎగరేసింది.

చిత్ర భోజనాల దగ్గర వినీతని పొగిడిపొగిడి ఊరుకుంది. వినీత భర్తని మళ్ళీమళ్ళీ చూసింది. అతను కాస్త ఇబ్బందిగా ఫీలయ్యాడు.

సందీప్, చిత్ర వెళ్ళిపోయిం తర్వాత-

రెండు, మూడు సిగరెట్లు కాల్చి,

ఆమెను చేత్తో పట్టుకుని బాల్కనీలోకి తీసుకెళ్ళి-

"నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి" అన్నాడు.

వినడానికి సిద్ధమన్నట్టు చిరునవ్వు నవ్వింది వినీత.

సంవత్సరంగా ఆమె ఎదురుచూసిన క్షణం.

ఆ సంవత్సరంలో ఆమెకు కొన్ని విషయాలు అర్థం అయ్యాయి. కాలగమనంలో, సహగమనంలో ఎవరి పని వాళ్ళు చేసుకుంటూ- చిన్న ముల్లు, పెద్ద ముల్లులా ముందుకు వెళ్ళిపోవాలి. కొంతమంది ఎప్పుడూ ఓ పదినిముషాలు ఆలస్యంగానే ఉంటారు. వాళ్ళు మనలా వేగంగా ఆలోచించట్లేదనుకోవడం సమంజసంకాదు. కొంతమంది ఓ పది నిముషాలు ముందుగా స్పందిస్తారు. ఆ వేగం మన ఆలోచనకు పనికి రాకపోవచ్చు. ఎవరి టైమ్ పరిధికి వారిని వదిలెయ్యాలి.



** ** **

విజ్జు వినీత జీవితంలోంచి వెళ్ళిపోయేటప్పటికి ఆమె వయసు ముప్ఫైరెండు. కొత్త ఇల్లు తీసుకుని అందులోకి మారింది. ఇంటి సామాను సర్దుతుంటే వింత అనుభూతి. దిగులుని పెంచే అలజడి- మరోవైపు అన్నీ స్పష్టమైనప్పుడు ఉండే ప్రశాంతత. ఒక్కొక్క చీర సర్దుతుంటే వాటి ప్రత్యేకత, పరిచయం వేరేగా అనిపిస్తోంది. విభజించుకుంటూ విడిపోవడం కూడా ప్రేమలోని ఓ ముఖ్యమైన భాగమే!

కొత్త ఇంట్లో పడమటి దిక్కునుంచి వచ్చే గాలి ఆస్వాదిస్తూ ఆశా భోంస్లే గొంతు వింటూ ఖాళీగా ఉన్న గదుల్లో అటూఇటూ తిరుగుతూ, పెట్టెల్లోంచి అన్నీ తీసి సర్దుతూ- ఆ గడియారాన్ని బయటకు తీసింది. పది నిముషాలు వెనక్కి తిరిగితిరిగి ఆగిపోయిన గడియారం- చూస్తే వింతగా ఉంది.

బలమైన మనిషి కండలు తిప్పుతూ గుండెల నుంచి మోకాళ్ళదాకా గడియారం పట్టుకుని ఉంటాడు. కాలగమనాన్ని అతనే నియంత్రిస్తున్నట్టు చిన్న చిరునవ్వు. బాటరీ ఉంటే, ప్రతి 'టిక్'కి గుండెల దగ్గర బల్బ్ లాంటిది వెలుగుతుంటుంది. ఆమె గబగబా రెండు బాటరీలు సంపాదించి- అతడి వీపు విప్పి అమర్చింది.

ముల్లు కదల్లేదు.

వింత బొమ్మ. ఎందుకు దాన్ని ఎంగేజ్‌మెంట్ గిఫ్ట్‌గా విజ్జు ఇవ్వాలనుకున్నాడో! ఏదో మొదట్లో తప్ప అది సరిగ్గా తిరగనేలేదు.

ఆమెకు నవ్వొచ్చింది.

గడియారాలు కాలపు కఱ్రముక్కల చితి పేరుస్తాయి. ఎవరికి తోచినట్టు వాళ్ళు అందులోకి దూకేస్తారు. చిటపటల సంసారమో, బూడిద పాతివ్రత్యమో మిగులుతుంది.

వినీత పర్సనల్ ఫోన్ మోగింది. అట్నుంచి శాస్త్రిగారు- ఆ రోజు సాయంత్రం, వినీత చేసిన క్విజ్‌షో మొదటి ఎపిసోడ్ వస్తుంది. మొదట భయపడ్డట్టు కాకుండా, అన్ని సెకన్లూ అమ్ముడుపోయాయి. స్పాన్సర్లు ముందుకు వచ్చారు.

"మన యం.డి చాలా హాపీగా ఉన్నారమ్మా- మరో ఆరు నెలల వరకూ మనకి ఢోకా లేదు. మీ తరవాతి ప్రొపోజల్ గురించి ఆలోచించండి. మర్చిపోకుండా- పది నిముషాల తక్కువ ఆరుకి టీవీ పెట్టండి."

●